క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితురాలికి సహాయం


బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న తోట పద్మావతి, లండా రమణ

అల్లిపురం: రెండు రోజుల క్రితం కొబ్బరితోటలో భవానీ అనే మహిళ ఇంట్లో ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శుక్రవారం వారింటికి వెళ్లి పరామర్శించారు. వారికి తగిన సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితులు అగ్నిప్రమాదం వల్ల తాము కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మావతి వారికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దూడ అప్పారావు, అనిల్, గోవింద్, జ్యోతి, దానయ్యమ్మ, తేజారత్నం, భాస్కరరావు, అప్పలరాజు, సత్యవతమ్మ, వెంకటేష్, జీవీఎంసీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు


వృద్ధులకు అల్పాహారం అందజేస్తున్న మనోజ్‌కుమార్

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ 29వ వార్డు యువజన విభాగం కార్యదర్శి తమ్మినేని శ్రీనివాస్ శుక్రవారం జిల్లా పరిషత్ దరి అమెరికన్ ఓల్డేజీ హోమ్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధుల నడుమ కేక్ కట్ చేసి, వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. తన కుమారుడు మనోజ్‌కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కనకల ఈశ్వర్, బీసీ సెల్ సెక్రటరీ బెవర మహేష్, గుమ్మడి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ వ్యతిరేక పోరుబాటకు ఏడాది


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరావు

దాబాగార్డెన్స్: విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనకు ఈ నెల 30 నాటికి ఏడాది అవుతుందని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి టి.నరేంద్రరావు, సిటు నాయకులు కె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, బి.జగన్ తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం కింద ఆస్పత్రిని ప్రైవేటీకరించాలని చూస్తున్నారన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, పెన్షనర్లు ఆరోగ్య సంరక్షణకు పోర్టు ఆస్పత్రిపై ఎక్కువగా ఆధారపడుతున్నారని అన్నారు. అటువంటి ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందన్నారు.

బీచ్‌ను శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


బీచ్ శుభ్రం కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు

దాబాగార్డెన్స్: ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు శుక్రవారం ఆర్‌కే బీచ్ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పర్యావరణం పట్ల స్పృహ, సముద్ర జీవాల పరిరక్షణ పట్ల మక్కువ ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ ఎ.హైమావతి, డాక్టర్ లావణ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


గానుగ ద్వారా వచ్చిన నూనె


తూర్పు గోదావరి జిల్లా నుంచి తీసుకొచ్చిన కొబ్బరి



గానుగాడాక వచ్చిన నూనెను ఫిల్టర్ చేసే పైపులు

పురాతనం.. అయినా ప్రశస్తం

- గానుగ నూనెకు తగ్గని ఆదరణ
- యంత్రాలతో గానుగాడి నూనె విక్రయిస్తున్న వ్యాపారులు
- పాతనగరంలో కనుమరుగు కాని నాటి సంప్రదాయం

జగదాంబ: పాత రోజుల్లో ప్రశస్తమైన వాడుక నూనె కావాలంటే గానుగ నూనె వాడేవారు. మహిళలు ప్రసవం అయినప్పుడు తప్పకుండా గానుగ నూనెతో చేసిన వంటకాలే వడ్డించేవారు. అలా చేస్తే బాలింతలకు ఆరోగ్యం చేకూరుతుందని.. బిడ్డకు తగినన్ని పాలు పడతాయని పెద్దవాళ్లు చెప్పేవారు. అయితే కాలక్రమేణా ఆ సంప్రదాయం ఎక్కడా కనిపించడంలేదు. అంతా ప్యాక్డ్ నూనెలను ప్లాస్టిక్ కవర్లలో తెచ్చుకుని వాడుకుంటున్నారు.

అంతా కళ్ల ముందే..

గతంలో ఇంట్లో గానుగ ఆడి తయారు చేసిన నూనె అమ్మేవారు. ఇప్పుడు ఎలక్ట్రికల్ మిషన్లు వచ్చిన తర్వాత దుకాణాల్లోనే వాటిని అమర్చుకుంటున్నారు. వినియోగదారులకు కావల్సిన నూనె వారి ముందే గానుగ తీసి అమ్ముతున్నారు. అందుకే వినియోగదారులు కాస్త ఆలస్యం అయినా దగ్గరుండి నూనె ఆడించుకుని తీసుకెళ్తున్నారు.


యంత్రంతో ఆడి నూనె తీస్తున్న వ్యాపారి

పెట్టుబడి, ధరా ఎక్కువే..

గానుగకు సంబంధించిన వస్తువుల ధరలు గతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ వినియోగదారులు ఆరోగ్య పరిరక్షణకు గానుగ నూనెను వాడుతున్నారు. గానుగ ఆడేవారు తూర్పుగోదావరి నుండి ఎండు కొబ్బరి, శ్రీకాకుళం, తుని, విజయనగరం వంటి ప్రాంతాల నుండి వెరు సెనగ, నువ్వులు తీసుకొచ్చి శ్రేష్టమైన గానుగ నూనె తీసి విక్రయిస్తున్నారు. పది కిలోల నువ్వులు గానీ ఎండు కొబ్బరి గానీ గానుగలో వేస్తే 5 కిలోల నూనె వస్తుంది. అలాగే వెరు సెనగ పది కిలోలు వేస్తే నాలుగు కిలోలు మాత్రమే దిగుబడి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు.

గానుగ నూనెలకు చిరునామా పాతనగరం

గానుగ నూనెలకు పాతనగరం ఎంతో ప్రసిద్ధి. బాలింతలు వాడే నల్ల చింతపండు, జీలకర్ర, నల్లబెల్లం నుంచి తీసే నూనెల వరకు అన్నీ ఇక్కడే దొరుకుతాయి. అందుకే నగరంలో అన్ని ప్రాంతాల్లో చిన్నా చితకా గానుగ దుకాణాలున్నా పూర్ణామార్కెట్ వద్ద గల గానుగ వద్దకే ప్రజలు ఎక్కువగా వస్తారు. కల్తీ నూనెలు రాజ్యమేలుతున్న నేపథ్యంలో చెక్క గానుగ నూనెకు మాత్రం ఏమాత్రం ఆదరణ తగ్గలేదు. పాత తరం వారు మాత్రమే కాకుండా ఈ తరం వారు కూడా ఇప్పటికీ ఆరోగ్యం కోసం గానుగ నూనె వాడుతున్నారు. ఇందుకు నిదర్శనం ఇప్పటికీ పూర్ణామార్కెట్ దరి చెక్కగానుగ నూనె మిల్లులు వినియోగదారులతో రద్దీగా కనిపించడమే.

మాది వారసత్వ వ్యాపారం..



మా తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఈ వ్యాపారం చేస్తున్నాం. గతంలో గానుగ ఇంట్లో ఆడేవాళ్లం. ఇప్పుడు వినియోగదారుల కళ్ల ముందే మిషన్‌తో ఆడి ఇస్తున్నాం. కల్తీ ఉండదు. ప్రజల ఆదరణ చాలా బాగుంది. – బాబూరావు, గానుగ నూనె వ్యాపారి, పూర్ణామార్కెట్

అంతా కల్తీమయం..



ఏ నూనె డబ్బా కొనాలన్నా కల్తీయే. రిఫండ్ ఆయిల్ అంటున్నారు. కానీ ఎక్కడ స్వచ్ఛమైనది దొరుకుతుంది? అందుకే చెక్కగానుగ నూనెపై ఆసక్తి చూపిస్తున్నాం. ఈ నూనె వాడకంతో ఆరోగ్యం చేకూరుతుంది.

– మంగ, వినియోగదారు, కలెక్టరేట్ దరి

30 ఏళ్లుగా వాడుతున్నాం..



గానుగ నూనె స్వచ్ఛత మిగతా వాటికి లేదు. పురటాల సమయంలో ఈ నూనె వాడితే తల్లీబిడ్డలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ నూనె ఎవరైనా వాడవచ్చు. కల్తీకి ఆస్కారం ఉండదు. 30 ఏళ్లుగా వాడుతున్నాం.

– అరుణ, వినియోగదారు, పైనాపిల్ కాలనీ

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి సన్యాసినాయుడు

మహారాణిపేట: కాలేజీల్లో ర్యాగింగ్ అనేది తీవ్రమైన నేరం అని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో ర్యాగింగ్ నివారణపై వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఏఎంసీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై నిర్బంధ ఉత్తర్వుల జారీ

అల్లిపురం: ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధి సెక్టార్-6 అంజయ్యనగర్‌కు చెందిన సిగాలపల్లి కుందన్ (24) అనే యువకుడిపై నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. అనైతిక ట్రాఫిక్ నేరస్తులు, భూకబ్జాదారులు, ప్రమాదకర కార్యకలాపాల నివారణ చట్టం 1986 కింద శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జారీ చేసిన ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమలులో ఉంటాయి.

అర్థరహిత నిర్ణయాలను రద్దు చేయాలని ఆందోళన

బీచ్‌రోడ్డు: మహిళలకు నైట్ డ్యూటీలు వేయాలని, కార్మికుల పని గంటలు పెంపు చేయాలనే అర్థరహిత నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవి, సత్యవతి మాట్లాడుతూ కార్మికుల పని గంటలు 13 గంటల పెంపు, మహిళలకు నైట్ డ్యూటీలు వేయాలనే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్స్ వరలక్ష్మి, కొండమ్మ, సుమిత్ర, విజయలక్ష్మి, ఎ. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లుల పోరుబాట


ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

జీతాలందక సెక్యూరిటీ గార్డుల ఇక్కట్లు


నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ గార్డులు

జగదాంబ: నాలుగు నెలలుగా జీతాలందక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఇందిరా మున్సిపల్ స్టేడియం సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధి 35వ వార్డులో ఉన్న ఈ స్టేడియంలో పది మంది మగవాళ్లు, పదిమంది మహిళలు సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. వీరికి గత కాంట్రాక్టర్ మూడు నెలల కిందటి వరకు సక్రమంగానే జీతాలు ఇచ్చేవారు. తర్వాత ఆ కాంట్రాక్టర్ మారి కొత్త కాంట్రాక్టర్ వచ్చారు. ఆయన మూడు నెలలు గడిచిపోయి, నాల్గవ నెల కూడా గడిచిపోతున్నా జీతాలకు సంబంధించి ఫైల్ పెట్టకపోవడంతో సెక్యూరిటీ గార్డులు ఆర్థిక కష్టాలతో అల్లాడుతున్నారు. అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. చిన్నపాటి ఉద్యోగాలతో కుటుంబాన్ని పోషించుకునే తమకు నెలనెలా జీతాలు ఇవ్వకపోతే ఎలా గడుస్తుందని సెక్యూరిటీ గార్డులు కనకరాజు, మంగరాజు, ఈశ్వరరావు, మహిళా గార్డులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తామకు జీతాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

బాలకృష్ణకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఘాటుగా స్పందించారు. బాలకృష్ణ తాగి జగన్‌ను దుర్భాషలాడినందుకు కచ్చితంగా రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడేటప్పుడు కొంచెం నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. బాలకృష్ణ సినిమాల్లో హీరో అయితే.. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో రియల్ హీరో అని.. అందుకు రాష్ట్రంలో 40 శాతం ఓటు బ్యాంకు జగన్‌కు ఉండడమే నిదర్శనమన్నారు. తాము తలచుకుంటే నటుడు పవన్ కల్యాణ్ మాదిరిగా బాలకృష్ణ సినీ జీవితాన్ని కూడా అంతం చేయగలమని హెచ్చరించారు. నటుడు చిరంజీవికి జగన్ ఎంతో గౌరవం ఇచ్చారన్నారు. అయినా తప్పుడు ప్రచారం చేస్తారా? అని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ గౌరవం ఇచ్చారు కాబట్టే అంత మంది హీరోలు మెచ్చుకున్నారని అన్నారు. రాజకీయంగా బాలకృష్ణ ఎన్నేళ్లు ఉన్నా జీరో అని, చంద్రబాబు ఆయనకు ఎలాంటి అవకాశం ఇవ్వరని పేర్కొన్నారు. ఇలాగే తాగి జగన్‌మోహన్‌రెడ్డి గురించి వాగితే సినిమాల్లో కూడా జీరో అయిపోతావ్ జాగ్రత్త అంటూ వాసుపల్లి హెచ్చరించారు.


వాసుపల్లి గణేష్‌కుమార్

డాక్టర్ విజయలక్ష్మికి నేషనల్ సేవా ఐకాన్ అవార్డు

దాబాగార్డెన్స్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ, విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ యోగ అండ్ మెడిటేషన్ (సిమ్) డైరెక్టర్, అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వై.విజయలక్ష్మికి నేషనల్ సేవా ఐకాన్ అవార్డు అందజేశారు. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు దశాబ్దాలుగా పర్యావరణం, యోగా, ఆరోగ్య రంగాల్లో చేస్తున్న సేవలను గుర్తిస్తూ అవార్డు అందజేశారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజినల్ డైరెక్టర్ జీవీబీ జగదీష్, జిల్లా టూరిజం అధికారి ఎం.మాధవి, డాక్టర్ హరిప్రసాద్, వాస్తు రత్నభూషణ్ డాక్టర్ పట్నాయక్ నారాయణమూర్తి, ప్రముఖ దర్శకుడు మణిభూషణ్‌కుమార్ చేతుల మీదుగా విజయలక్ష్మి పురస్కారం, ధ్రువపత్రం అందుకున్నారు. ఆమెను బి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

స్టెమ్ సెల్ దానంపై అవగాహన

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, బోటనీ విభాగం, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో దాత్రీ-బ్లడ్ స్టెమ్ సెల్ డోనర్ రిజిస్ట్రీ, ఇండియా సహకారంతో రక్త, స్టెమ్ సెల్‌దానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ జన్యు విశ్లేషణ, మూలకణ మార్పిడి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ములగాడ సూర్యనారాయణ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


అధ్యాపకులు, అతిథులతో విద్యార్థులు

మహాలక్ష్మిగా పూజలందుకున్న దుర్గమ్మ


అన్నసమారాధనలో పాల్గొన్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు


గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరి

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో కొలువైన ఉమాదేవి అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవశర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

మహాలక్ష్మీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ..

యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ శుక్రవారం భక్తులకు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గమ్మ దయ ప్రజలందరిపై ఉండాలి..

దుర్గమ్మ దయ ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆకాంక్షించారు. వార్డు నాయకుడు బూరుల చిన్నా, అరుణ దంపతుల ఆధ్వర్యంలో 33వ వార్డు బంగారమ్మ మెట్టలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలకు వాసుపల్లి హాజరై దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బూరులు చిన్నా, అరుణ దంపతులు 17 ఏళ్లుగా దసరా ఉత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పచ్చిరపల్లి రాము, వార్డ్ ప్రెసిడెంట్ ముత్తాబతుల రమేష్, వేగి వెంకటప్పారావు, సౌత్ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సూర్యనాయుడు, ఆడారి వెంకట మహేష్, బాడుగ శ్రీనివాస్, కొల్లి సత్యవతి, వెంకట మహేష్, కనిగిరి సంతోష్, బాల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా కన్యకాపరమేశ్వరి..

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్‌లో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు దసరా ఉత్సవాల ఐదవ రోజు శుక్రవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో శ్రీవాసవీ స్నేహాలయం, కొల్లూరి విశాల, గరుడ విజయలక్ష్మి బృందంచే మణిద్వీప వర్ణన పారాయణం నిర్వహించారు. శనివారం కన్యకాపరమేశ్వరి బాలాజీ అవతారంలో దర్శనమివ్వనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్, ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా దుర్గాలమ్మ..

వెలంపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గాలమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ధైర్యలక్ష్మి పాహిమాం..


ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన కనకమహాలక్ష్మి అమ్మవారిని భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజించారు. భవభయహారిణి.. మంత్రస్వరూపిణి అయిన అమ్మ, తమకు మనోధైర్యాన్ని ప్రసాదించి, సదా కాపాడాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, తులసీదళాలతో సహస్ర నామార్చన చేశారు.

– దాబాగార్డెన్స్

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అక్టోబర్ 8,9 తేదీల్లో 'స్వాతంత్ర్యానంతర తెలుగు-హిందీ సాహిత్యంలో మహిళా రచయితల సాహిత్య కృషి' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపి సంబంధిత బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రైటర్స్-జర్నలిస్ట్స్ అసోసియేషన్ భారత్ సౌజన్యంతో జరగనున్న రెండు రోజుల సదస్సులో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు ప్రధాన వక్తలుగా పాల్గొంటారన్నారు. తెలుగు-హిందీ సాహిత్యాల్లో రచయిత్రుల శైలిపై ప్రసంగిస్తారని కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో జె.నిర్మల, ఎస్.దీప్తి, కోటేశ్వరరావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో షాపింగ్ ఫెస్టివల్

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నాలుగు వారాల ప్రణాళికను అమలు చేస్తున్నామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. శుక్రవారం, సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్'అనే నెల రోజుల కార్యక్రమం, సీజనల్ కండీషన్స్, పీఎం కుసుమ్ పథకం, బయోగ్యాస్ ప్లాంట్లు, సోలార్ విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సంబంధిత అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ప్రారంభమైందని, 25 నుంచి 29 వరకు పొదుపు అంశాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6 వరకు వ్యవసాయం, ఇతర వృత్తులపై వారికి, 7 నుంచి 13 వరకు విద్య, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితరాల గురించి వివరిస్తామన్నారు. అక్టోబరు 14 నుంచి 18 వరకు టూరిజం, సేవా రంగం, పునరుత్పాదక శక్తి, ఆటోమొబైల్స్ మొదలైన అంశాలపై అవగాహన, షాపింగ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని కలెక్టర్ వివరించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఏటీఆర్, సరోగసీ దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట: కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన ఏఆర్‌టీ, సరోగసీ చట్టం అమలుపై శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఆర్‌టీ, సరోగసీ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో కేజీహెచ్ గైనకాలజిస్టు డాక్టర్ సౌమిని, పిల్లల వైద్యురాలు డాక్టర్ రత్నకుమారి, రేడియాలజిస్టు డాక్టర్ శ్రీకాంత్, పలు విభాగాల వైద్యులు డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ లూసీ, డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో)బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పి.రమేష్‌బాబు, జి.మల్లేశ్వరి, ఎల్.వి.రమణి, ఎస్.సాయి రోహిత్, కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్. చిత్రంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

జర్నలిస్టుల హెల్త్ ప్రీమియం త్వరలో చెల్లింపు

మహారాణిపేట: జర్నలిస్టుల హెల్త్ ప్రీమియం సీఎస్ఆర్ నిధుల ద్వారా చెల్లించడానికి కలెక్టర్ హరీంధరప్రసాద్ తనను కలిసిన ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. రాము, ఆర్. రామచంద్రరావు తదితరులకు తెలిపారు. వారం రోజుల్లో జర్నలిస్టుల వాటా ప్రీమియం చెల్లిస్తామని కలెక్టర్ తెలిపినట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు. దాంతో పాటు గుర్తించిన ఆస్పత్రుల ద్వారా అక్టోబర్‌లో జర్నలిస్టులకు మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ముందుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. చంద్రమోహన్, డి. హరినాథ్, గాజువాక యూనిట్ అధ్యక్షుడు పరశురాం కలెక్టర్‌ని కలిసిన వారిలో ఉన్నారు. అంతకు ముందు ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు జిల్లా ప్లానింగ్ అధికారిని కూడా కలిసి ప్రీమియం మొత్తం వివరాలు తెలిపారు.


కలెక్టర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తున్న జర్నలిస్టులు